# రెండో సముద్రం

-విహారి

నాలుగో అంతస్థు అపార్ట్‌మెంట్. కిటికీలో నుంచీ బయటికి చూసింది స్వరూప. నగరం వొళ్లు విరుచు కుంటోంది. తెలతెలవారుతోంది. ఈదరగాలి వీస్తోంది. ఆకాశంలో నల్లటి మబ్బు. 'నా మనసులాగానే ఉంది ఆకాశం' అనుకుంది.

ఒక శాంట్రోకారు రోడ్ కడ్డదిడ్డంగా పరిగెడు తోంది- తాగి తూలుతున్నవాడిలా! వివేకానందమూర్తి అన్నట్టు 'పెట్రోల్‌లో స్కాచ్ కలిసిందేమో'. 'స్కాచ్'! అవును అదీ తన ప్రభావం చూపుతోంది, బతుకుమీద. పక్కకి మసిలింది. ఆలోచనలు ముసిరినై.

ఆలోచనలు... ఆలోచనలు! ఆలోచనలే రాత్రి నంతా తినేసినై. మనసుని ఎప్పుడో తినేసి చిరిగిన కంబళీ చేసేసినై. పత్రహరితాన్ని సర్వమూ హరింప జేసుకున్న తమలపాకులా తాను- ఉత్త ఈనెల్తో మిగి లిందివాళ!

ఈ వీకెండ్ ఇలా మిగిలింది!

రాత్రి తొమ్మిదింటికి బెంగళూరు వెళ్లాడు రాఘవ. భర్త. ఔను. భ...ర్త! హార్డ్‌వేర్ ఇంజనీర్. హార్ట్‌తో సహా మనిషి మనిషంతా హార్డ్‌వేర్!

'ఎవరి కర్మకి ఎవరు కర్తలు' అంటూ వుండేది అమ్మమ్మ. ఇప్పుడు లేదు. తన కర్మకి తాను పోయింది. తాతయ్య పెట్టని కష్టం లేదని అంటూ వుండేది అమ్మ!

నిజానికివాళ తానా తన బతుక్కి కర్త? అయితే, జిలానీ బాను కథలు చదువుతుంటే, తల చిట్లేటట్లు కుర్చీకేసి కొట్టాడెందుకు? సీతాదేవి నవల ఉరిత్రాడు చదువుతుంటే లాక్కుని చించేశాడేం? టీవీలో 'న్యాయం కావాలి' సినిమా చూస్తుంటే చూడనీయలేదేం? అలాంటివి చదివితే, చూస్తే తనకు బుర్ర ఖరాబవు తుందట!- హార్డ్‌వేర్ భర్త!

అస్థిమితంగా పక్కమీదనే కదిలింది స్వరూప. పెళ్లాం ఉద్యోగం మానకూడదు. నెలకి పదివేలు మరి! తాను వచ్చి హైదరాబాద్‌లో వేరే ఉద్యోగం చూసుకో కూడదు. బెంగళూరు బాగుంటుంది. బెంగళూరు లైఫ్ బాగుంటుంది. లైఫ్ స్టైల్ బాగుంటుంది. మందు బాగుంటుంది. మందు పార్టీలూ బాగుంటాయి!

శనివారం ఉదయం ఆరింటికల్లా హైదరాబాద్‌లో దిగటం. ఇంటికి రాగానే, 'ఈ వారంలో ఫోన్లే మొచ్చినై'తో మొదలు. 'ఎవరెవరొచ్చారు?' ఎవరెవర్ని కలిశావ్?'తో కామాపెట్టి, 'కలిశావ్' మీద పన్! తెలివితేటల ప్రదర్శన. ఎదురు కాంప్లెక్స్‌లో ఎవరో సినిమా మనిషి. 'వాడికెదురుగా ఈ అపార్ట్‌మెంటే దొరి కిందా?' అని గుచ్చిన సూదులే మళ్లీ మళ్లీ గుచ్చటం. పసికర్ల కళ్లు. అనుమానం రోగం. దేహాన్ని ఎక్స్‌రే చూపుల్తో తడుముతూ 'ఎత్తు ఎటూ లేదు. దానికి తగ్గట్టు అన్నీ కుంచించుకుపోతున్నయ్' అని వొక వికట దరహాసం; కుళ్లు జోకు!! అక్కడో ఫుల్‌స్టాపు! కూతురు గిరిజ అప్పటికి స్కూల్‌కి తయారవుతుంది. పొడి పొడి మాటలు. బ్రేక్‌ఫాస్ట్ అవుతుంది. వెంటనే పదకొండు పన్నెండు గంటల దాకా నిద్రా, గురకా! చూడటానికి అసహ్యమైన ఉచ్ఛ్వాస నిశ్వాసాలు!

ఒంటి గంటన్నరకు భోజనం. నలభై రకాల రుచులు కావాలి. ఎన్ని చేసినా, ఎలా చేసినా వంట చేయడం చేతకాని పెళ్లాన్ని కట్టబెట్టి చచ్చిందని వాళ్ల మ్మకి శాపనార్థాలు.

స్కూల్ నుంచీ గిరిజ వస్తుంది. దాన్ని తీసుకు వెళ్లటానికి రెండు గంటలయ్యే సరికే అమ్మ రావాలి. శని, ఆదివారాలు పిల్ల బస అమ్మదగ్గరే. తన వీకెండ్

## బద్ది నానీలు

ఆతడు / పేదల పాలిట పెన్నిధి
తల్లిదండ్రులకు మాత్రం / అందని నిధి

పేద గుండె / కష్టాల కొలిమిని పడి
మండి మండి / గట్టిపడింది

కుక్కతోక / వంకరైతేనేమి
మనసు మాత్రం / విశ్వాసపాత్రం

శిశువు / గర్భంలోనే భద్రం
బయటపడితే / క్షణక్షణం గండం

రక్తబంధం / బొడ్డు తెగితే సరి
డాలరు బంధం / ఆజన్మాంతం సిరి

-బద్ది నాగేశ్వరరావు

శృంగారానికి ఐదేళ్ల పిల్ల అడ్డుకాకూడదు.

అమ్మా, గిరిజా బయటికి కదలటం ఆలస్యం- "ఏం చేస్తున్నావ్? ఇంకా కాలేదా సర్దుడు? ఎప్పుడూ ఆ వంటగదికి అతుక్కుపోయి ఛస్తుంది" అంటూ బెడ్‌రూమ్‌లో సిగరెట్లూదుతూ రంకెలు. వెంటనే బలవంతపు పవళింపుసేవ! 'పగటి నిద్రా, పగటి రతీ విషతుల్యం' అంటే- తన చదువు మీద సవాలక్ష జోకులు; శతకోటి వెబ్‌సైట్ల ఆరోగ్య సూత్రాల లెక్చర్లు. తిన్న నాలుగు మెతుకులూ కడుపులో సర్దుకునేలోగా- దైహిక, మానసిక హింసా కార్యక్రమం మొదలు. ఆ కక్కుర్తిపని...! ఛీ... కర్మ! తానా కర్త?! ఇదా తాను కావ్యాల్లోనూ, ఎంకి పాటల్లోనూ, బాపిరాజు గారి నవలల్లోనూ చదువుకుని, మనసులో కూర్చుకున్న మధుర భావాల సుమమాల. పెళ్లయిన ఆర్నెల్లకే అది తెగిపోయింది! ఎవరు కర్త?

టీ సిద్ధం చేయాలి. దాని తర్వాత- అదుగో మళ్లీ ఆ నిద్రా, గురకా! సాయంత్రం హరించుకుపోతుంది. శేష ప్రశ్నలు భయపెడుతూనే ఉంటాయి.

చక్కగా, ఆహ్లాదంగా ఏ నెక్లెస్ రోడ్‌కో పోయి సరదాగా తిరిగి రావాలనీ, ఏ సుల్తాన్ బజార్‌కో వెళ్లి విండో షాపింగ్ చేయాలనీ; ఏ కామత్‌లోనో, మినర్వాలోనో కబుర్లు చెప్పుకుంటూ డిన్నర్ చేయాలనీ... చిన్న చిన్న కోరికలు. కానీ- రాఘవ? తన జీవితం చుట్టూ గోడలు కట్టేశాడు. ఒక సరదా లేదు, సంబరం లేదు. చిలిపి చూపులు లేవు. చిరు అలకలూ లేవు. స్వీట్ నథింగ్స్ లేవు. బుజ్జగింపులూ లేవు, బువ్వపు బంతులూ లేవు. అన్నీ చీకటి పూలయిపోయాయి.

శనివారం రాత్రి. ప్రేమ, ఆనందం, ఆవేశం, ఉద్వేగం- తనలోని అన్ని సున్నిత భావాల విధ్వంసం జరిగిపోతుంది. తన అనంగీకారాలూ, ఆవులింతలూ, పెదవుల తిరస్కారాలూ- ఏవీ ఆ హార్డ్‌వేర్‌కి అర్థంకావు. అవరోధమూ కావు. ఆ తర్వాత- ఒక వికటహాసం, ఒక కటిక విలనీ వెలువడుతాయి మాటల్లో. మొదట్లో తెలిసేదికాదు. ఒకరోజు మాటల పోరులో బయట పడ్డాడు. ఉద్యోగం చేసే పెళ్లాన్ని అదుపులో ఉంచుకోవాలంటే ఇదే బెస్ట్ మెథడట! శాడిజమ్ బాగా వంటపట్టింది. తన ఏడుపు, తిరస్కారం, కోపం- ఏవీ పనిచేయలేదు. చెంపలు పగిలినై. హార్డ్‌వేర్ కదా. ఐరన్ హేండ్!

ఏదైనా తీవ్రమైన నిర్ణయం తీసుకుందామంటే- "ఆడపిల్ల తల్లివి. తొందరపడకూడదు" అని అమ్మ

## సంధ్యాబిబ్బోకం

ఒక గాలి వీచింది ఊహనే ఉసిగొల్పి ఏ భావ
గీతాల నెత్తికొనునొ
ఒక సోగ లలితాకు నిట్టూర్పు విడిచింది ఏ పూల
గజ్జియల కెదద నిడునొ
ఒక వీచి సంపంగి ఒనరులో కొనసాగి ఏ తావి
గుండియల కేతమవునొ
ఎరుక జారిన వారి ఎడదల చీకటి మొత్తమ్ము
లడగించు ప్రొద్దుపొడుపు
కుంకుమార్చన సలుపగా గోష్ఠిచేసి
కోవిదారము లరుణిమ క్రుమ్మరించ
సమవధాన రోచీవశ నిటలావ
తంస తిలకమ్ము తూర్పులో తరళమయ్యె!

కొలువు కొమ్మల పులుగులు గొంతులెత్తె
గాలి మలకల తీయని గమకమయ్యె
రాలు పూవులు తేలెడి రథ్యనిలచి
ఏటి చెంపల తడిమెను ఎలమిజోక!

ఒక మహాకవి తపఃప్రకటిత శక్తితో రచియించెనా
సాంధ్య ప్రసరదీప్తి
ఒక జాణోజు చంద్రికలోని సౌకుమార్యము నద్దెనా
సోయగమును దిద్ద
ఒక వేల్పుచాన మై యోజలో దొరగిన అందమా?
చందమై సందడించ
మలుగుచాయల మలుపు సదులు దాదాపుల
సందెవేళల గొంతు సంతవేయ
నిదుర కొమ్మల పులుగులు కదలుసద్దు
గాలి మెదలిక నాపిన గమనక్లుప్తి
పూల పుప్పొడి గుండెకు పూతబరువు
ఏటి చెంపల తడిమిన ఏణ ఋభువు!

సబలి కందుకము జారెను సంద్రమందు
చిందె చినుకు లెగసి పైన చుక్కలగుచు
శాంత శీతల రమణీయ సాంధ్యరోచి
సాగె సాలోక్య హృద్దీప సవనమగుచు!

పురుటి నొప్పులు పడుచున్న పూర్వయామ
నడక నొప్పుల విరతిగా పడమటింటి
మధ్య నడయాడు దృశ్యాల మంచెమీద
ఆత్మరసయోగ బిబ్బోక మవఘళించె!!

-సాంధ్యశ్రీ

ఆలోచించనివ్వదు. అవును. ఆమె కూడా ఆడపిల్ల తల్లినే కదా- ఆ కాలంలో కోపిష్టి నాన్నకి, బాధ్యత నెరగని దుర్మార్గపు నాన్నకి లొంగిపోయి ఉన్నది. పెళ్లాన్నీ, ఇద్దరు పిల్లల్నీ గాలికొదిలేసి, తమ బతుకుల్ని బజారున పడేసి దేశాటనం పోతే, ఎంత దుర్భర దారిద్ర్యాన్ని అనుభవించింది? పోయినవాడు పోయి,

## ఓటర్ల జాబితా

స్వార్థానికి కళ్ళు మొలిచినపుడు
కాలం, దాని నోటిలో మాంసపు ముద్ద అవుతుంది
రుచి, నెత్తురులో కరిగేలోపు
మెదడులోని ఆలోచనల నిండా
రాజ్యకాంక్ష రంగుల చిత్రాన్ని గీస్తుంది
ఎవడి బతుకు వాడి సొంతం
సింహాసనం కోసం
మాయల మూటల్ని విప్పుతారు
తంత్రులతో సమ్మోహన పరుస్తారు
నాలుకపై అబద్ధాల్ని అందంగా ఊరిస్తారు
గెలుపు ఎవరి నుదుట తిలకమవుద్దో తెలీదు
ఎప్పుడు, ఏ రకమైన బాంధవ్యం
తీగెలా అల్లుకుంటాదో తెలీదు
విజయాన్ని చొక్కా గుండీగా అమర్చుకునేందుకు
హింసా దౌర్జన్యాలు చుట్టాల్లా కదలివస్తాయి
పీకలు తెగడం, నెత్తురు కారడం,
సారా, వాన్లై కురిసినంత తేలికయింది
చదరంగంలో పావుల్ని కదిపినంత సులువుగా
ఎన్నికల రణంలో నోట్ల కట్టలు కదులుతాయి
ఆలోచనా శక్తి ఉన్న వాడిని చూసి
ఓటర్ల జాబితా ఫక్కున నవ్వుతుంది
మభ్యపడే వాళ్ళ పేరులే అక్షరాలై కనిపిస్తాయి
ఎన్నికల యంత్రాంగంలో పనిముట్టు అయినవాడు
కర్తవ్యంలో కరిగి, చూపుడు వ్రేలుపై
నల్ల చుక్కని కోల్పోతాడు.
వేయాల్సిన వాడికి ఓటు లేనప్పుడు
వేసే ప్రతి అడుగు-
అప్రజాస్వామ్యపు బాటలోనే పడుద్ది.
ఓటర్ల జాబితాలో నిజాయితీ వికసించినపుడే కదా
ప్రజాస్వామ్యం నుదుట భవిష్యత్తు తిలకమై మెరుస్తాది.

**-యస్. ఆర్. పృథ్వి**

ఎక్కడో తేలి, వేరే ఎవరితోనో కాపురం పెట్టాడని తెలిస్తే ఏం చేయగలిగింది కనుక? నరం లేని నాలుకతో లోకం ఎన్నెన్ని మాటలు అన్నా, గుండె రాయి చేసుకుని రెప్పలకింద ఉప్పెనని దాచుకోలేదూ?

లేచి మంచం మీద కూర్చుంది స్వరూప. బయటికి చూసింది. ఎవరో ఆరడుగుల యువకుడు. పక్కగా అంతే ఎత్తున్న యువతి. ఇద్దరూ జీన్స్, టీ షర్టుల్లో నడుస్తున్నారు. మార్నింగ్ వాక్. ఒకసారెప్పుడో రాఘవతో అలా వెళ్దామని అంటే 'జనం వింత జంతువుల్ని చూసినట్టు చూస్తారు. నా మొహానికి అంత అదృష్టమా?' అని లెసన్ పీకి గంటసేపు బూతుపురాణం విప్పాడు. ఆ కోరిక కాస్తా ఆ విధంగా కరి మింగిన వెలగ పండయిపోయింది. కరి ఎవరు? నిర్జీవంగా నవ్వుకొంది.

మంచం దిగుదామని ప్రయత్నించింది. వొళ్లు సలుపుతోంది. ఆదివారమంతా రాఘవ ఆటాయె! శరీరమా ఉక్కుముక్కా?! సలపకేమవుతుంది. ఏడుపొచ్చింది. కళ్లు మండుతున్నై. తుడుచుకుంది. నిద్ర లేమి. అలసట. రెప్పలు పైనా, లోపలా కూడా గరగర లాడుతున్నై.

కాలింగ్ బెల్ మోగింది. తప్పనిసరిగా మంచం దిగింది. వెళ్ళి తలుపు తీసింది. పనిమనిషి.

సోమవారం మొదలు. అంతా రొటీన్. పేపర్ వచ్చింది.

కాఫీ తాగుతూ, దినపత్రిక తిరగేస్తుంటే గిరిజని తీసుకుని వచ్చింది సరోజ. సరోజ అమ్మా వాళ్ల పక్కింటామె. ఆమె ఏడింటికే ఉద్యోగానికి బయల్దేరాలి. సనత్‌నగర్‌లో ఉద్యోగం. ఉండేది వారాసిగూడా. ఇదే దారి. కాఫీ ఇచ్చింది సరోజ. పిల్ల తన పనిలోకి వెళ్లింది. మాటలు సాగినై సరోజతో.

'ప్రతివారం మీకిదో పని. చాలా సహాయం చేస్తున్నారు' స్వరూప.

సరోజ ఏమీ మాట్లాడలేదు. నవ్వి ఊరుకుంది. పేపర్ తీసుకుంది. దాన్ని తిరగేసింది. క్షణాల తర్వాత యథాలాపంగా అన్నది, "నా హెల్ప్‌దేం ఉందిగానీ, మీ అమ్మ పాపం చాలా కష్టపడుతోంది."

స్వరూప ఏదో మాట్లాడేలోగానే రక్కున లేచి, "వస్తా స్వరూపా, టైమయింది. రామ్‌నగర్ నుంచీ సనత్‌నగర్ దాకా కొలవాలిగా మనం" అని చిరునవ్వుతో బయటికి కదిలింది. లిఫ్ట్ దాకా నడిచి, ఆమెని సాగనంపి వచ్చేసింది స్వరూప.

గదిలో పుస్తకాల సంచీ సర్దుకుంటోంది గిరిజ. పిల్లని ఆదివారం సాయంత్రం తెమ్మంటానంటే- గ౯య్‌మని లేచాడు రాఘవ. 'చాల్లే ప్రేమ. నీకుందిగా- చూపించు' అంటూ సంభాషణని- తొలిచూలు ఆడపిల్ల కావటం వలన తానెలా నడివయస్సులో తాతయ్య అవుతాడోననే విషయంలోకి తీసుకుపోతాడు. ఒక వికారపు భంగిమలో, అసహ్యాన్ని వెలిగక్కుతాడు. అసలు ఏడుపు- ఆ రెండు మూడు గంటల తన దౌర్జన్యపు చర్యకి ఆ పిల్ల అడ్డు అవుతుందనే. ఆ 'యావ'కి కౌన్సిలింగ్ ప్రసక్తి తెస్తే, ఒకసారి నానా యాగీ చేసి 'బెంగళూర్లో సూసైడ్ చేసుకుని, నువ్వే కారణమని నోట్ పెట్టా జాగ్రత్త' అని హెచ్చరించాడు. అమ్మతో అంటే ఆమె భయంతో అవాక్కయింది!

అవును, అమ్మకి అన్నిటా భయమే. పిరికి మనసు ఆమెది. టైలర్‌గా తన బతుకు వెళ్లదీస్తోంది. చిన్న చిన్న పిల్లలకి ట్యూషన్సూ చెప్తుంది. ఆ సంపాదనలో ఎక్కువ భాగం గద్దలా తన్నుకుపోవటానికి తన 'అన్న' ఉన్నాడు. కృష్ణమూర్తి. ముప్పై ఏళ్లు దాటినా మైనర్ వెధవే! జులాయి తిరుగుళ్లు. నాలుగు రోజులు ఏదో మార్కెటింగ్ జాబ్ చేస్తున్నానంటాడు. మరో వారం

## బాబ్లీ కసాయి బాబులు

పిల్లలాటలో
ఎక్కడి దొంగలక్కడే గప్‌చిప్‌లాగా
ప్రాజెక్టులాటలో
ఎక్కడి నీళ్ళక్కడే గప్‌చిప్!
గత చరిత్రలో 'మొహంజదారో' వరదలు పొంగి
మృతుల దిబ్బెందో... ఏమో కానీ
వర్తమానంలో 'మహానదీ దారులు' నీళ్ళు పొంగక
ఇసుక దిబ్బలవుతున్నాయి.
విద్యుత్ తీయబడినవే అయినా
మానవులలో విద్యుత్ పుట్టిస్తున్నాయి నీళ్ళు
ఆకాశం నుంచి తెచ్చి జటాఝూటంలో బంధించి
ఒకప్పుడు నేలవైపు పారించిన నీళ్ళు
పాతాళం నుంచి తీసి మినరల్ లేబుల్ ముద్రించి
ఇప్పుడు 'వెల'వైపు పారిస్తున్న నీళ్ళు!
చెట్లు కూడా 'కార్బన్ దయాక్సైడ్' సిలిండర్ కొనుక్కొని
ఆకుల పొయ్యిలపై పిండి వంటలు వండుకోవాల్సి
వచ్చినట్లు
జీవనదులు కూడా 'తుఫాన్‌ల' సిలిండర్ కొనుక్కొని
దిగువ ప్రాజెక్ట్ పొయ్యిలపై 'నీటిసుడుల' వంటలు
చేసుకొని
కడుపు నింపుకోవాల్సిన ఆ'కలి' నీటి కాలం కదా!
పల్లమెరుగు నీటికి తలలు పగలకొడుతూ
కడుతున్నారా ప్రాజెక్టులు?
నీటిపక్కనే పుట్టి నీటి కాటుకే బలౌతున్నాయి
మానవ నాగరికతలు?
నరుడు కంటికి నాపరాళ్ళైనా పగులుతాయని
దిష్టినుండి తప్పించుకోవడానికి దాచి దాచి
నీ ఇష్టానుసారం కట్టుకోవడానికి
ఇదేమీ నీ ఇంట్లో
బెడ్‌రూంకి అటాచ్డ్ బాత్‌రూం కాదు.
ఇది మా దాహపు గొంతులకు 'ఎటాచ్డ్' ప్రాజెక్టు
ఇది మా పచ్చని పంటలపై 'ఎటాక్డ్' ప్రాజెక్టు
నక్షత్రాల చీమలు పట్టకుండా
చందమామ మిఠాయి పొట్లంని
ఇన్ని యుగాలుగా ఆ 'ఆకాశమాయ' దాచినట్లు
'దిగువ' కరువు చీమలు పట్టకుండా
బాబ్లీ మిఠాయి పొట్లంని
ఈ జలయుగంలో కూడా దాస్తున్నావా అవకాశ
మాయల మరాఠీ?
ఏ అడవిలో ఏ రక్తదాహపులికి
నీడనిచ్చిన చెట్టు నుండి చేసిందో
ఈ లాఠీ / నీటి దాహార్త చూపులపై పంజా ఎత్తి
విరుచుకుపడుతోంది.
ఓ షిర్డీ సాయిబాబా...
నీవు గోలీకాయలాడుకుంటున్నావా?
ఈ బాబ్లీ కసాయిబాబులు
మా గొంతుకాయలతో ఆడుకుంటుంటే!
ఓ విఠల పాండు రంగడా...
నీవు వక్క పలుకులు నములుతున్నావా?
ఈ లాఠీల గూండా రంగళ్ళు
మా మక్కిలిరగ తంతుంటే!
నాసిక్, త్రయంబకమనే తన రెండు కళ్ళు
మూసుకొని / గోదారి శబరమ్మ
తలకిందులుగా తపస్సు చేయాల్సిందేనా?
'శ్రీరాంసాగర్' రాముడికి
నీటిపండ్లు అందివ్వాలంటే!

**-కె. ఆంజనేయకుమార్**

ట్రాన్స్‌పోర్ట్‌లో ఉద్యోగమంటాడు. ఇంకో నెల ఇన్సూరెన్స్ ఏజెంట్‌గా లక్షలార్జిస్తానంటాడు. శుష్కప్రియాలూ, శూన్యహస్తాలూ!! పెళ్లి చేస్తే కుదురుగా ఉంటాడని- 'అర్ధాంగి' సినిమా నాటి ఆలోచనతో- ఒక గంతకు తగ్గ బొంతని తెస్తే- ఆ పిల్ల రాజశ్రీ- వీడి దెబ్బకి తట్టుకోలేక పారిపోయింది. పుట్టింట్లో ఉండి సేల్స్ గాళ్‌గా పనిచేసుకు బతుకుతోంది. ఆ మధ్య ఎప్పుడో కలిసి పలకరించింది. 'ప్రాణం హాయిగా ఉంది- వదినా. రూపాయో అర్ధో- నా కూడు నేను తింటున్నాను' అన్నది ఎంతో తృప్తిగా.

'అమ్మా- నా బూస్ట్' అంటూ బాత్‌రూమ్‌లో నుంచీ హాల్లోకి పరిగెత్తుకొచ్చింది గిరిజ. ఛెంగున స్వరూప వొళ్లో వాలింది. 'మా గిరిజ గుడ్ గాళ్' అంటూ చెక్కిలి మీద ముద్దెట్టుకుని లేచింది, స్వరూప. కూతురికి బూస్ట్ కలిపి ఇచ్చింది. టైమ్ చూస్తే- ఏడున్నర!

తప్పదు. పరుగో. పరుగో. అన్ని ఆలోచనలకీ బ్రేక్! కదిలింది. దినచర్యకీ కాళ్లొచ్చాయి!

## కనబడని ఉదయం

మబ్బు కడుపులో నీరుందో లేదో
మంచి వాన పడితేనేగాని తెలియదు
కడలి గర్భంలో ఎన్ని రత్నాలున్నాయో
కలచి చూస్తేనే గాని తెలియదు
దిక్కుల అంచుల్లో ఎన్ని తేజోబింబాలున్నాయో
ఒక్కసారి ఉదయం అయితేనే గాని తెలియదు
చుక్కల మేనుల్లో ఎన్ని సొంపులున్నాయో
సొగసైన జాబిల్లి నవ్వితేగాని తెలియదు
పుడమిపై ఎన్ని పర్వతాలున్నాయో
పూని అధిరోహిస్తే గాని తెలియదు
భువిలో ఎన్ని అగాధాలున్నాయో
ముందుకు నడిస్తే గాని తెలియదు
ఒక జీవితం వెనుక ఉన్న అనుభూతి
ఓపికగా అన్వేషిస్తేనే గాని తెలియదు
చీకటి వెనుకగల సుప్రభాతం
వేకువ జామున గానీ బయటపడదు
మార్పే అనుక్షణం ప్రాణమని
మనిషికి ఎప్పుడోగాని తెలియదు
అది తెలియకపోతే అతని బ్రతుకులో
అదృష్టం నిలువదు! / అవకాశం పిలువదు!!

-డా॥ అయాచితం నటేశ్వరశర్మ

తొమ్మిది. రిక్షాలో గిరిజని స్కూల్‌కి పంపించింది. తానూ తయారయింది. పదింటికే ఆఫీస్.

పదిన్నరయింది. రజని, రమణి, శారద- కబుర్లలో ఉన్నారు. వీకెండ్ గురించి షేరింగాఫ్ న్యూస్ అండ్ వ్యూస్! మామూలు కార్యక్రమం ఇది. 'ప్రతి సోమవారమూ ఓ అరగంట ఆఫీస్ టైమ్ కిల్డ్!" అనుకుంది స్వరూప.

రజని అడిగింది, "ఏం స్వరూపా. అంత డల్‌గా ఉన్నావ్. మీ శ్రీవారు రాలేదా?" సన్నగా నవ్వి ఊరుకుంది స్వరూప.

రమణి చెప్పుకుపోతోంది, "నిన్నంతా మేం యమ బిజీ. పదకొండింటికే ఫుడ్‌చేసి బయటపడ్డాం. పిల్లలకీ, మాకూ కూడా ఆటవిడుపు. మ్యూజియమ్ చూసి, శిల్పారామం వెళ్లాం. బాగా ఎంజాయ్ చేశాం. మా వారికిలాంటి ప్రోగ్రామ్స్ అంటే చాలా హుషారు. శ్రుతీ, లయా ఐతే... ఓహ్. దే ఎంజాయ్‌డ్ ఎలాట్!" రమణి మొహంలో, కళ్లల్లో ఆనందం. తదేకంగా ఆమెనే చూడసాగింది స్వరూప.

శారదా చెప్పకొచ్చింది. వరంగల్ నుంచీ వాళ్లాయన వస్తే ఇద్దరు పిల్లల్తో కీసరగుట్ట వెళ్లొచ్చి, ఐమాక్స్‌లో సినిమా చూసి, రాత్రి డిన్నర్ బయటే చేసి ఇంటికి చేరేరట!

రజని వీళ్ల కబుర్లని కొనసాగిస్తూ చెప్పింది, "నేనూ, మా వారూ నిన్న హాఫ్‌డే క్లీనింగ్ డ్యూటీలో పడ్డాం. పాపం. ఎక్కువ శ్రమ ఆయనదే." రజనికింకా పిల్లల్లేరు. వాళ్లాయనకి సెక్రటేరియట్‌లో జాబ్.

ముగ్గురూ తనవైపు చూశారు. తాను ఏదో బిజీ అన్నట్టు కంప్యూటర్ స్క్రీన్‌పైకి దృష్టి మరల్చింది. రమణి స్వరూప దగ్గరకు వచ్చి "ఏం మేడమ్, ఏమిటో ఆలోచిస్తున్నారు?" అంది.

స్వరూప అయిష్టంగా "ఆఁ... ఏం లేదు" అని ముక్తసరి సమాధానం చెప్పింది. ఇంతలో మేనేజర్ హాల్లోకొచ్చాడు. ఎవరి పనికి వాళ్లు మళ్లారు.

స్వరూపకి వీళ్ల ముగ్గురి కబుర్లూ అంతగా ఆశ్చర్యం కలిగించకపోయినా, ఆలోచనల్ని రేపాయి.

వీళ్లంతా ఇంత అదృష్టవంతులా? వీళ్ల భర్తలూ ఉద్యోగస్థులే మరి. రాఘవా చదువుకుని ఉద్యోగం చేస్తున్నవాడే. ఎందుకిలా తయారయినాడు? "చదువుకీ బతుక్కీ ఖండాన్వయం, దండాన్వయం కూర్చుకున్నా, తాత్పర్యంలో అన్వయలోపం రావచ్చురా" అంటూ ఉండేవారు, తెలుగు మాష్టారు. ఇదే కాబోలు దాని

అర్థం! తన బతుకెందుకిట్లా అయింది? తన బతుకు ఇరుసుకీ, చక్రానికీ మధ్యనున్న మేకు ఊడిపోయిందేం? తన జీవన శైలి ఎందుకిలా సారహీనమయి పోయింది? ఎవరు కర్త? ఆధునిక జీవన విధానం తెస్తున్న అనర్థాల్లో ఇదీ ఒకటి?

చిన్నప్పుడు- అమ్మమ్మ గడ్డం పుచ్చుకు మరీ చెప్పింది, 'మీ చిన్న మామయ్యని చేసుకోవే సుఖపడతావ్' అని. అమ్మ వినలేదు. 'మేనరికం ఒప్పుకోను' అంది. 'అయినా, ఆ శంకరంకి ఒక కాలు అరంగుళం తేడా. నడకలో తెలుస్తుంది' అనే వంకా పెట్టింది. శంకరం మామయ్య బ్యాంక్‌లో డీజీఎమ్‌ట! చాలా కష్టపడి రాఘవని తెచ్చింది. చాలా అప్పు మూట కట్టుకుంది!

స్వరూపకి కళ్లు చెమర్చినై. కొంగుతో తుడుచుకుంది. ఆరేళ్ల నుంచీ సాగుతున్న ఒక టీవీ సీరియల్ చూసి 'అంతా ట్రాష్. మగవాళ్లిలా ఉండరు' అనుకుంది తాను. కానీ, ఇవ్వాళ? ఆ పాత్రలే బెటరనిపిస్తోంది. వాస్తవం ఎప్పుడూ కాలులో ముల్లే!

అమ్మా-నాన్న! రాజశ్రీ-అన్నయ్య! తానూ-రాఘవ!

దాంపత్యమంటే ఇంతేనా?

స్వరూప మనస్సు పనిమీదకి పోవటంలేదు. ఆలోచనలు గచ్చు పొదలా మారినై.

పక్క క్యూబికల్‌లో కుమార్ వచ్చాడు. అతని వెనగ్గా చంద్రశేఖర్ వచ్చాడు. స్వరూప గమనించింది. "ఏరా వచ్చేశావ్? సెలవింకా ఉందిగా?" అడుగుతున్నాడు చంద్రశేఖర్. క్షణాల తర్వాత కుమార్ చెప్తున్నాడు. స్వరూపకి వినిపిస్తోంది. "అవును. లీవ్ కేన్సిల్ చేసుకుని వచ్చేశా. కొన్నాళ్లు తనకి దూరంగా ఉంటే మా ఆవిడ తిక్కలో ఏమన్నా మార్పొస్తుందేమోనని ఆశ. మా అమ్మా, అత్తగారూ కూడా ఇదే సలహా ఇచ్చారు. ఇదే చికిత్స అని చెప్పే సాహసం లేదుగానీ ట్రీట్‌మెంట్ బిగినింగని మాత్రం చెప్పగలను" అని మళ్లీ అన్నాడు, "మానవ సంబంధాలు సరిచేసుకోవాలన్నా 'ట్రయిలెండ్ ఎర్రర్' పద్ధతి తప్పదు కదా" అని.

కుమారొక భార్యా బాధితుడు. ఆఫీస్‌లో ఎక్కువ మందికే తెలుసు. మొగవాడు కదా. చెప్పుకుంటూ ఉంటాడు. అతని భార్యదొక పొసెసివ్ నేచర్; దుబారా మనిషి. దార్ఢ్యకమూ ఎక్కువే.

స్వరూప మేథలో ఎన్నెన్నో ఆలోచనలు ముసిరినై. తల్లికి ఫోన్ చేసింది. చాలాసేపు మాట్లాడింది. టైమ్ చూసింది. పన్నెండు కావస్తోంది. ఒక నిశ్చయాని కొచ్చింది. ఏ తర్కానికీ లొంగనిది కదా- జీవితం- చూద్దాం అనుకుంది.

రాఘవకి ఫోన్ చేసింది, "నేను మా అమ్మని తీసుకుని కాశీ, ప్రయాగ, హరిద్వారా వెళ్తున్నాను. నెల రోజులు పట్టొచ్చు. రావద్దు. అవును, గిరిజనీ తీసుకునే వెళ్తున్నాను. స్కూల్ పోయినా ఫర్వాలేదు... నే చెప్తాను- వచ్చిన తర్వాత..."

ఫోన్ కట్‌చేసింది. తటాలున ఏదో ఊహ వచ్చింది. 'గతం పుస్తకం. బతుకు ప్రస్తుతం. రేపు? వెలుగే కావాలి! ఆశ రెండో సముద్రం!' ప్రాణం హాయిగా ఉందిప్పుడు. సెలవు కోసం కదిలింది!! ■

## జీవధార

నారీరూపంగా తోస్తుంది నది
కడుపు చలువగా తనను గర్భీకరించుకొన్న తల్లి
పంపిన అసమ్మతి పత్రంలా
పంతంకొద్దీ పుట్టుకొచ్చిన పసిపాపలాగు
చిన్నబోయినట్లుంటుంది - నది కృశాంగియై!
అప్పుడనిపిస్తుంది-
తనను చించుకు పుట్టిన తన జాతి అంకురాన్ని
చూచి ఒక తల్లి విరక్తిగా పెదవి విరిచినట్లుందని!

## కవిత్వం

నా కవిత్వం ఆర్ద్ర జలదాక్షరి
సుహృత్ స్వరాక్షరి - శాంతి బీజాక్షరి!

ο ο ο

అనాది కాలపు అక్షయ సంస్కృతి నాది
తరతరాల ఈ జాతి జీవస్పందనం
తన్నుకురాక తప్పదు తమోగర్భంనుండైనా!
తొలిశ్వాసలో అంటిన మాతృవత్ స్పర్శ కదా అది!
తొలివాక్కులో అమరిన అక్షరోజస్సు కదా అది!

## శ్రమశక్తి

బ్రతుకుతెరువుకు బరువు మోస్తూ
కాయకష్టం కడుపు కోసం!
పరిశ్రమిస్తే నుదుట మొలిచిన
స్వేదబిందువు ఘర్మబిందువు
నిలిచి గెలిచిన శక్తి సింధువు!

-సి. వేదవతి